పశువుల ఆరోగ్య సంరక్షణకు టీకా

- గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు
- వాతావరణ మార్పుల వల్ల వ్యాధుల బారిన పశువులు
- సకాలంలో వైద్యం అందించాలంటున్న అధికారులు
- జిల్లాలో నేటి నుంచి పశువులకు వ్యాక్సినేషన్


జీలుగుమిల్లిలో పశువులకు టీకా వేస్తున్న దృశ్యం (ఫైల్)

బుట్టాయగూడెం: పశువులకు వచ్చే వివిధ వ్యాధుల నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధుల వల్ల పశువులో పనిచేసే శక్తి, పాల ఉత్పత్తి తగ్గుతుంది. పశువులకు వచ్చే వ్యాధుల్లో ముఖ్యమైనవి గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధి. ఈ మూడు రకాల వ్యాధులు సోకడం వల్ల లేగదూడలు, పెయ్యలు ఎక్కువ సంఖ్యలో మరణించే అవకాశం ఉందని పశువైద్యాధికారులు అంటున్నారు. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గి ఆర్థిక నష్టం కలుగుతుంది. ఈ పరిస్థితుల్లో పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా వాతావరణ మార్పుల వల్ల వచ్చే గాలిగుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచిత టీకా కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా మార్చి 24 నుంచి ప్రారంభం కానున్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు. ఈ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సకాలంలో పశువులకు వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. సకాలంలో టీకా వేయిస్తే వ్యాధులు పశువుల దరి చేరవని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. 3 నెలలు దాటిన ప్రతి పశువుకూ తప్పనిసరిగా టీకా వేయించాలి పశువైద్యాధికారులు కోరుతున్నారు.

గాలిగుంటు లక్షణాలు

పశువులకు గాలికుంటు వ్యాధి సోకిన వెంటనే జ్వరం వస్తుంది. నాలుక, చిగుళ్లు, కాలి గెట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. మేత తినవు. ఎక్కువసేపు నిలుచుని ఉండలేవు. ఎక్కువ దూరం నడవలేవు. పశువులు నోటి నుంచి నురగ కక్కుతూ ఉంటాయి. ఈ లక్షణాలు గమనిస్తే రైతులు వెంటనే పశువులకు గాలిగుంట వ్యాధి నివారణ టీకాలు వేయించాల్సి ఉంటుంది.

నివారణ ఇలా

వ్యాధి సోకిన వెంటనే పశువులను ఇతర పశువుల నుంచి వేరుగాఉంచాలి. అలా చెయ్యకపోతే ఇతర పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి వైద్యం సకాలంలో అందించేలా కృషి చెయ్యాలి. పశువులకు గాలికుంటు వ్యాధి సోకిన తర్వాత పెన్సిలిన్, యాంటీ ఇన్లమిన్, యాంటీ ఇన్లమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, కాలి గిట్టమధ్య గ్లిజరిన్‌తో శుభ్రంచేసి బోరిక్‌పౌడర్ వెయ్యాలి. తద్వారా వ్యాధి సమస్యను పరిష్కరించవచ్చు.

ట్యాగింగ్ ఆధారంగానే టీకాలు

జిల్లాలో పశువులున్న గ్రామాల్లో గోపాలమిత్రలో పలు పశువులకు గత ఏడాది ట్యాగింగ్ వేశారు. ప్రస్తుతం ఈ ట్యాగింగ్ ఆధారంగానే పశువులను గుర్తించి గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వెయ్యనున్నారు. ఇప్పటివరకూ పశువులకు ట్యాగింగ్ చేసుకోని రైతులు వెంటనే తమ పశువులకు ట్యాగింగ్ చేయించాలని పశువైద్యాధికారులు కోరుతున్నారు.

జిల్లాలో 1,21,18,692 పశువులు, కోళ్లు

జిల్లాలో సుమారు 1,21,18,692 వివిధ రకాల పశువులు, కోళ్లు ఉన్నాయి. వీటిలో ఎద్దులు 1,36,549, దున్నపోతులు 5,12,142, గొర్రెలు 5,26,836, మేకలు 1,98,810, పందులు 7,646, కోళ్లు 1,03,47,494 ఉన్నట్లు అధికారులు తెలిపారు. పాలిచ్చే పశువులైన ఆవులు 81,930, గేదెలు 3,07,285 ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

పశువులకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి



పశువులకు గాలికుంటు వ్యాధి సోకకముందు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి. పశువుల్లో వ్యాధి వచ్చినట్లు గుర్తించి సకాలంలో వైద్యం అందిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధి వచ్చిన తర్వాత కంటే ముందుగానే వ్యాక్సిన్ వేయిస్తే మంచిది.

– డాక్టర్ జి. నెహ్రూబాబు, పశువైద్యశాఖ జాయింట్ డైరెక్టర్, ఏలూరు

నేటి నుంచి వ్యాక్సిన్ కార్యక్రమం



పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు శనివారం నుంచి వ్యాక్సిన్ కార్యక్రమం చేపడుతున్నాం. రైతులు పశువుల్లో వచ్చే ఈ వ్యాధిని గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందించకపోతే అవి మృత్యువాత పడే అవకాశం ఉంది. మూడు నెలలు వయస్సు దాటిన పశువులన్నింటికీ వ్యాక్సిన్ వేయించాలి.

– డాక్టర్ ఎం. సాయి బుచ్చారావు, పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జీలుగుమిల్లి

కొయ్యలగూడెం వాసికి కర్షక రత్న అవార్డు


కర్షక రత్న అవార్డు గ్రహీత పాట్టిపోతుల పోతురాజుకు సత్కారం

కొయ్యలగూడెం: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కొయ్యలగూడెం వాసి పాట్టిపోతుల పోతురాజుకు కర్షక రత్న అవార్డు లభించిందని ప్లానెట్ గ్రీన్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిడదవోలు వినయ్ రామ్ పేర్కొన్నారు. కొయ్యలగూడెంకి చెందిన వినయ్ రామ్ హైదరాబాద్ కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో ప్రకృతి వ్యవసాయాన్ని గత పదేళ్లుగా ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2023వ సంవత్సరానికి ఉగాది వేడుకలను పురస్కరించుకొని 16 మంది రైతులను రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో ఎంపిక చేశామని తెలిపారు. కొయ్యలగూడెంకు చెందిన పాట్టిపోతుల పోతురాజు కోస్తా జిల్లాల నుంచి ఎంపికై నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వేద భారత్ నేచురల్ ఫుడ్ ప్రొడక్ట్ కంపెనీతో సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించామన్నారు. దేశవాళీ ధాన్యం రకాలైన చింతలూరి సన్నాలు, బహురూపీ, మాపిలై సాంబ, దూదేస్వర్, సిద్ధ సన్నాలు, ఇంద్రాణి తదితర రకాల ఆహార ధాన్య విత్తనాలను ప్లానెట్ గ్రీన్స్ ద్వారా రైతులకు అందజేశామన్నారు. వాటిని సేంద్రియ పద్ధతుల ద్వారా రైతులు పండించారని వినయ్ రామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులను సత్కరించారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు శాస్త్రవేత్త విజయరామ్, గాలం కోటేశ్వరరావు, చిన్న, మట్టా శ్రీను, దివాణం మురళీకృష్ణరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు అభిషేకాలు

జంగారెడ్డిగూడెం: శ్రీచక్ర సహిత ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మ కుమారి దంపతులు ఆలయంలో ఉన్న ఉత్సవ విగ్రహానికి 27 రకాల పదార్థాలతో పంచామృత, ఏకవారం రుద్రాభిఅభిషేకాలు, సాయంత్రం 22 హారతులు అమ్మవారికి సమర్పించారు. శుక్రవారం అమ్మవారిని దేవరకొండ దత్తు, విశాలాక్షి, డాక్టర్ దేవరకొండ లావణ్య, డిప్యూటీ కలెక్టర్ దేవరకొండ అఖిల, తడికమళ్ల రామకృష్ణ దంపతులు, ఎర్ర నాగేశ్వరరావు, సత్యలక్ష్మి, కోలా సుబ్రహ్మణ్యం సంధ్యారాణి, చోడవరపు రంగా, జ్యోతి దంపతులు దర్శించుకున్నారు.

ఘనంగా ముత్యాలమ్మకు గ్రామోత్సవం

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలో కొలువైన ముత్యాలమ్మవారి గ్రామోత్సవం శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పదో వార్షికోత్సవాలు పురస్కరించుకొని ఈ నెల 20న ఉత్సవాలు ప్రారంభమై శుక్రవారం ముగింపు సందర్భంగా వెయ్యిమంది మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో గ్రామంలో మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగించారు.

సీఎం జగన్‌కు దళిత క్రైస్తవుల కృతజ్ఞతలు

కామవరపుకోట: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి, తీర్మానం కేంద్రానికి పంపుతున్న శుభ సందర్భంలో మండలంలో శుక్రవారం ఏపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులు హర్షం వ్యక్తం చేసి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీ డైరెక్టర్ పండు జగదీష్ మాట్లాడుతూ గతంలో ఎన్నడులేని విధంగా సీఎం జగన్ చొరవతో దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించి బిల్లు ప్రవేశ పెట్టడం శుభ పరిణామం అన్నారు. స్థానిక సీఎస్ఐ, ఆర్.సి.యం, కర్మెల్ సంస్థల ఆధ్వర్యంలో పలువురు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ జాబితాలో చేర్చడం హర్షణీయం

టి.నరసాపురం: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర సైనిక్ కో కన్వీనర్ దూబా విల్సన్ శుక్రవారం పేర్కొన్నారు.

ప్రలోభాల్లో చంద్రబాబు సిద్ధ హస్తుడు

బుట్టాయగూడెం: చంద్రబాబు ఓట్లు కొనడమే కాదు ప్రలోభాల్లోనూ సిద్ధహస్తుడని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పటి నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను ప్రలోభపెడుతూ తెరవెనుక రాజకీయం చేశారని అన్నారు. నాడు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు రూ. 5 కోట్లు ఎరవేసి పట్టుబడిన చంద్రబాబు పారిపోయి ఏపీకి వచ్చారని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా చంద్రబాబుకు బుద్ధి చెప్తారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యేలంతా అండగా ఉన్నారని అన్నారు. ఆయన నాయకత్వంలోనే ముందుకు సాగుతామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని అన్నారు. వైఎస్సార్ సీపీలో నెగ్గి ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేసిన ఎమ్మెల్యేలు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ఆయన అన్నారు. ప్రజలే వారికి తగిన బుద్ధి చెప్తారని బాలరాజు అన్నారు.

రక్తదాన శిబిరం

పోలవరం రూరల్: పోలవరం మండలం వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కె.వెంకటలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. వైద్యాధికారి కె.మురళీధర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఐదు మండలాల్లో రక్తహీనతతో బాధపడుతున్న రోగులకు ఈ శిబిరంలో సేకరించిన రక్తం అందజేస్తామన్నారు. వైద్యాధికారి కె.వాసు, ఎంపీటీసీ కె.చిట్టెమ్మ, ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో వాల్మీకి, బోయలను చేర్చవద్దు

బుట్టాయగూడెం: ఎస్టీ జాబితాలో బోయ, వాల్మీకిలను చేర్చడం అన్యాయమని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ రామ్మోహన్ శుక్రవారం అన్నారు. ఆదివాసీ గిరిజనులు ఇప్పటికీ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో వెనుకబడి జీవిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ గిరిజన సంఘ నేతలు తెల్లం రామకృష్ణ, ధర్ముల సురేష్ కోరారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ పి. శ్రీహరి శుక్రవారం కోరారు. బుట్టాయగూడెం జనరల్-1, రెడ్డి గణపవరం ఉమెన్స్-3, పులిరామన్నగూడెం ఉమెన్-1, లక్ష్మడుగూడెం జనరల్-4 చొప్పున ఖాళీలున్నాయని తెలిపారు. షెడ్యూల్ తెగలకు చెందిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆయా సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పంచాయతీల్లో స్థానికులు 26 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను అందజేయాలని అన్నారు.

ప్రతిభా పరీక్ష విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీవీ సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు శ్రీ రామచంద్ర విద్యాసంస్థల ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 16 మంది ఇంగ్లీష్ మీడియం, ఇద్దరు తెలుగు మీడియం మొత్తం 18మంది విద్యార్థులకు రామచంద్ర విద్యాసంస్థల తరఫున నగదు బహుమతులను ప్రోత్సాహకంగా అందజేశారు. మొదటి స్థానం పొందిన పి. హేమంత్ రెడ్డికి మొదటి బహుమతి రూ. 3,000, సంయుక్తంగా రెండు, మూడవ స్థానాలు పొందిన వి.లీలా వినయ్‌కుమార్, ఎం.చంద్ర సాయి పవన్‌కు రూ. 1,500 చొప్పున, పోటీలో పాల్గొన్న మిగిలిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున కన్సొలేషన్ బహుమతులు శ్రీరామచంద్ర విద్యాసంస్థల అకడమిక్ చైర్మన్ బీవీ సత్యనారాయణ అందజేశారు. పాఠశాలకు 5 ఆఫీస్ చైర్‌లను పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు. పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సుధాకర రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ రామచంద్ర విద్యా సంస్థల ఏవో రమేష్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పచ్చిపాల మృత్యుంజయరాజు, కమిటీ సభ్యులు, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.విజయ ప్రకాష్, ఎస్.నాగేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ కట్టా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలకు గురువు చంద్రబాబు


గంగవరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: వెన్నుపోటు రాజకీయాలకు గురువైన చంద్రబాబు నాయుడుకి వైఎస్సార్ సీపీలోని నలుగురు శిష్యులు తయారై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని జెడ్పీటీసీ, జిల్లా విద్యా వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం గంగవరంలో గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ కుర్రు నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించి టీడీపీ అభ్యర్థిని గెలిపించిన ఎమ్మెల్యేలు వెన్నుపోటు పొడిచారని అన్నారు. ఇది వారి రాజకీయ జీవితాలకే కళంకం అన్నారు. వెన్నుపోటు రాజకీయాలకు ఆద్యుడైన చంద్రబాబు నాయుడు తన మామ ఎన్టీఆర్‌కు చేసిన ద్రోహం ప్రజలందరికీ తెలుసునని అన్నారు. ఓటుకు నోటు కుంభకోణంలో ప్రజాస్వామ్య విలువలను మంటగలిపిన చరిత్ర హీనుడు చంద్రబాబు నాయుడు అన్నారు. కుతంత్రాలతో ఇప్పుడు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ఒక ఎమ్మెల్సీని గెలిపించుకున్నప్పటికీ సార్వత్రిక ఎన్నికలలో టీడీపీకి ప్రజలు సమాధి కడతారన్నారు. పార్టీ అధిష్టానం నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడంతో క్రమశిక్షణకే పార్టీ పెద్దపీట వేస్తుందని తేటతెల్లమైందన్నారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, మాజీ సర్పంచ్ పాముల నాగముని స్వామి, మాజీ ఎంపీటీసీ తమ్మిర్సి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలకు సంసిద్ధం చేయండి


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

కామవరపుకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో 3ఏళ్ల నుంచి 6 ఏళ్ల ఈడు పిల్లలను పాఠశాలకు వెళ్లే విధంగా సంసిద్ధం చేయాలని తడికలపూడిలోని ఎన్టీఆర్ మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ బి.రెబ్కాశామ్యూల్ అన్నారు. స్థానిక మహిళా ప్రాంగణంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ప్రథమ ఎడ్యుకేషన్, ఐటీసీ సంస్థల ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల 52 మంది అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు, కార్యకర్తలకు పూర్వ ప్రాథమిక విద్య అంశంపై రెండు రోజులపాటు సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఈడు పిల్లల్లో జరిగే శారీరక అభివృద్ధి, మేధా అభివృద్ధి, భాష, సాంఘిక అభివృద్ధి వంటి అంశాలపై తల్లుల సమూహాలను ఏర్పాటు చేసి వారు మొబైల్ ఫోనుకు విద్యా సంబంధిత సందేశాలను పంపాలన్నారు. తద్వారా పిల్లలను పాఠశాలకు వెళ్లే విధంగా సంసిద్ధం చేయాలని రెబ్కాశామ్యూల్ తెలిపారు. సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణ దినోత్సవం


బయ్యనగూడెంలో క్షయ వ్యాధి నివారణ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అంతర్జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం బయ్యనగూడెం పీహెచ్సీలో శుక్రవారం వైద్యాధికారి కె.విజయకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడం కోసం అవును మనం క్షయ వ్యాధిని అంతమొందించవచ్చు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తుడు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఈ క్రిములు గాలి ద్వారా వేరొకరికి వ్యాపిస్తాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, ఛాతిలో నొప్పి, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గటం వంటి లక్షణాలుంటే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా కోలుకోవచ్చని తెలిపారు. ప్రజలందరూ ఈ వ్యాధిపై అవగాహన పెంచుకుని ప్రభుత్వం అందించే ఉచిత పరీక్షలు, చికిత్సను ఉపయోగించుకోవాలని కోరారు. వైద్యాధికారిణి డా కె.జ్యోత్స్నాదేవి, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.రమేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌పై తీర్పును స్వాగతిస్తున్నాం

కొయ్యలగూడెం: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై కోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి నాయకులు మోడేపల్లి నాగు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఓబీసీ మోర్చ నాయకులు శుక్రవారం తెలిపారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై నాలుగేళ్లుగా తెలి గాండ్ల, తెలుకుల సమాజం చేసిన పోరాటం బీసీ సమాజంలో ధైర్యాన్ని నింపిందన్నారు. నాలుగేళ్ల క్రితం రాహుల్‌గాంధీ బహిరంగంగా తెలి సమాజాన్ని కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనకు కోర్టు విధించిన శిక్షను స్వాగతిస్తున్నామన్నారు. కోర్టు నిర్ణయం దేశంలోని చట్టం, దేశ రాజ్యాంగం అత్యున్నతమని, దాని దృష్టిలో దేశంలోని పౌరులందరూ సమానమని చూపిస్తుందన్నారు. యావత్ ఓబీసీ సమాజానికి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ క్షమాపణ కోరాలని వారు డిమాండ్ చేశారు.

27, 28 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు

కుకునూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీల్లో ఏలూరు కలెక్టరేట్ ముందు సీపీఐ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి పేర్కొన్నారు. సీపీఐ మండల కార్యవర్గ సమావేశం కొన్నె లక్ష్మయ్య అధ్యక్షతన శుక్రవారం కుకునూరులో నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటాచారి మాట్లాడుతూ కాంటూరు లెక్కలను పరిగణలోకి తీసుకోకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నిర్వాసితులకు ఆర్ అండ్ఆర్ భూసేకరణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు వర్మా శ్యామల, కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు, వర్సా పాపారావు, వర్సా నాగేశ్వరరావు, రమణయ్య పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

జంగారెడ్డిగూడెం: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఈ నెల 27, 28 తేదీల్లో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ఉమ్మడి గోదావరి జిల్లాల రజక సంఘం అధ్యక్షుడు చాటపర్తి పోసిబాబు అన్నారు. జంగారెడ్డిగూడెంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించి రజక సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోసిబాబు మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమానికి 11 రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమైన రజక సంఘం నాయకులు హాజరు అవుతున్నారని తెలిపారు. 18 రాష్ట్రాల్లో 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారన్నారు. 3 రాష్ట్రాల్లో ఎస్టీ జాబితాలో ఉన్నారని అన్నారు. రజక సంఘం సీనియర్ నాయకుడు మందపల్లి లక్ష్మయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పరిహారంపై చర్చ


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

వేలేరుపాడు: గత ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో వచ్చిన గోదావరి వరదల వల్ల నష్టపోయిన బాధితులకు పరిహారం పెండింగ్‌లో ఉందని మండల పరిషత్ సమావేశంలో సభ్యులు తెలిపారు. కొంతమందికి పరిహారం అందించినప్పటికీ అకౌంట్ ఫెయిల్యూర్స్ పేరిట మరి కొంతమందికి సాయం అందలేదని వివరించారు. బాధితులకు వీలైనంత త్వరగా పరిహారం అందించాలని ఎంపీపీ కెచ్చెల లక్ష్మీదేవి అధ్యక్షతన శుక్రవారం ఇక్కడి ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సమావేశంలో కోరారు. ఇటీవల కన్నాయిగుట్టలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన 27 గిరిజన కుటుంబాలను కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హౌసింగ్, విద్య, వైద్య, వ్యవసాయ, అటవీ శాఖలపై సమీక్షించారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, కుక్కునూరు ఫారెస్ట్ రేంజర్ ఏడుకొండలు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఫారెస్ట్ డీఆర్వో పెరుమాళ్ల, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, వైస్ ఎంపీపీ కేసగాని వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

నూకాలమ్మకు పంచామృతాభిషేకం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా 8వ రోజైన శుక్రవారం ఆలయంలో నిత్యపూజలు, నిత్యకైంకర్యాలు, అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం, అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామంజనేయ (తపన) చౌదరి పాల్గొన్ని ప్రముఖులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్న తపన చౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధనలో సుమారు 10వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారని రాజాన సత్యనారాయణ తెలిపారు. అమ్మవారిని ముత్యాలమ్మ ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పట్టణ ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు కలువపూడి గోదాదేవి కర్ణాటక సంగీత గాత్ర కచేరీ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), వెంకటరామలక్ష్మి దంపతులు, వీరంపాలెం బాలా త్రిపురసుందరీ పీఠం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బంగారు శివలక్ష్మి, పీసుపాటి రామలక్ష్మి, కమిటీ సభ్యులు, ఆధ్యాత్మికవేత్త కే ఎల్ ఎన్ ధనకుమార్, శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి అధ్యక్షుడు ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ, దాకారపు గోపాలకృష్ణ, శ్రీనూకాంబికా మహిళా సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

26న లక్కవరంలో ఉచిత మెగా వైద్య శిబిరం

జంగారెడ్డిగూడెం: లక్కవరం గ్రామంలో ఈనెల 26వ తేదీ ఆదివారం నిర్మల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సిస్టర్ అర్చన శుక్రవారం తెలిపారు. లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో జనరల్ వ్యాధి నిపుణులు, స్త్రీల సంబంధిత వ్యాధి నిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, శస్త్ర చికిత్సల వైద్యనిపుణులు రోగులను పరీక్షిస్తారన్నారు. లక్కవరం పరిసర గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా బాలికా జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి అర్హత గల బాలికలు ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20 వరకు ఏపీకేజీబీవీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని కోరారు. కుకునూరులోని కేజీబీవీలో బైపీసీలో 40 సీట్లు, కేజీబీవీ వేలేరులో ఎంపీసీలో 40 సీట్లు, కేజీబీవీ వేలేరుపాడులో హెచ్ఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేజీబీవీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన అనాథలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, తల్లిదండ్రులు వలస వెళ్లిన బాలికలు, పేదరిక రేఖకు దిగువన ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఎంపికైన వారికి ఫోన్ ద్వారా మెసేజ్ పంపతామని వివరించారు. వివరాలకు కేజీబీవీ ప్రత్యేక అధికారులను ఫోన్ నెంబర్లు 94419 15166, 83741 72109, 89199 84331 ద్వారా సంప్రదించాలని సూచించారు.

పాఠశాలల్లో ప్రవేశాలకు..

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఈ ప్రవేశాలకు డ్రాప్ అవుట్ బాలికలు, బడి బయట పిల్లలు, అనాథలు, పాక్షిక అనాథలు, పీహెచ్‌సీలు, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు, తల్లిదండ్రులు వలస వెళ్లిన బాలికలు, పేదరిక రేఖకు దిగువ గాల బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు.

రైతులకు సరైన నష్టపరిహారం అందించండి


ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: నియోజకవర్గంలో నిర్మిస్తున్న రెండు ప్రధాన ప్రాజెక్టుల కారణంగా భూములు కోల్పోయిన రైతులకు సరైన నష్టపరిహారం అందించాలని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. శుక్రవారం రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో పాల్గొన్న ఎలీజా నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. నియోజకవర్గ పరిధిలో చింతలపూడి ఎత్తిపోతల పథకం, గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తున్నారని ఈ రెండు ప్రాజెక్టుల్లో రైతులు భూములు కోల్పోయారని తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి వారికి సరైన నష్టపరిహారం అందలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి అందరికీ ఒకే విధమైన నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు మరో చోట భూమి కేటాయించాలని, లేదా అక్కడున్న ధరలకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే విన్నవించారు. ఇటీవల వడగళ్ల వాన కారణంగా నష్టపోయిన రైతులకు త్వరగా పరిహారం అందించాలని కోరారు. మైలార్లకు కులధ్రువీకరణను కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు.